
వసూలు అయ్యేదెలా?!

పేరుకుపోతున్న విద్యుత్ బకాయిలు

- ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేదెలా..?
- జిల్లాలో పెండింగ్ బిల్లులు రూ.74.56 కోట్లు
- సర్కార్ ఆఫీసుల నుంచి రావాల్సినవి రూ.14.87 కోట్లు



మహబూబాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కొత్త ప్రభుత్వం కొలువుతీరాక 24 గంటల విద్యుత్‌పై అధికార, ప్రతిపక్షాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఆస్తులు పెంచామని బీఆర్ఎస్, అప్పులు చేశారని కాంగ్రెస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లలో పరస్పర విమర్శల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ వినియోగించిన సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, వీధిలైట్లు, ఇతరత్రా బకాయిలు పెద్ద ఎత్తున పేరుకుపోయి ఉండడం చర్చనీయాంశమవుతోంది. గిరిజన జిల్లా మహబూబాబాద్‌లోనే దాదాపు రూ.74 కోట్లకు పైగా బకాయిలు ఉండడం అందులోనూ.. ప్రభుత్వ కార్యాలయాల పెండింగ్ బిల్లులే సుమారు రూ.15 కోట్లకు పేరుకుపోవడం చూస్తే.. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ బిల్లులు పెద్దఎత్తున ఉండడం అతిశయోక్తి కాకపోవచ్చు..!



జిల్లాలో పెండింగ్ బిల్లులు ఇవి...

మహబూబాబాద్ జిల్లాలో విద్యుత్ శాఖలో తొర్రూ రు, మహబూబాబాద్ డివిజన్లు ఉండగా మొత్తంగా 18 మండలాలు ఉన్నాయి. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 3,28,688 అన్ని రకాల విద్యుత్ మీటర్ల ద్వారా రూ.74.56 కోట్లు బకాయిలు పేరుకుపోగా, ఇందులో పెద్ద మొత్తంలో సర్కార్ కార్యాలయాలకు సంబంధించిన బకాయిలు రూ.14.87 కోట్లు ఉండడం గమనార్హం. అనేక సంవత్సరాలుగా పలు శాఖలకు సంబంధించిన కార్యాలయాల విద్యుత్ బిల్లులు పూర్తి స్థాయిలో చెల్లించకపోవడంతో ఏకంగా ఒక్క మహబూబాబాద్ జిల్లాలోనే సుమారు రూ.15 కోట్ల వరకు బకాయిలు పడడం చూస్తే.. ఇక రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో సర్కార్ విద్యుత్ బకాయిలు ఏ విధంగా ఉంటాయో అర్థమవుతోంది. జిల్లాలోని గ్రామపంచాయతీలు, మునిసిపాలిటీలకు సంబంధించిన 2,987 మీటర్లకు రూ.2.86 కోట్లు విద్యుత్ శాఖకు బిల్లుల రూపంలో చెల్లించాల్సి ఉంది. మంచినీటి బావులు 1,297 మీటర్ల ద్వారా రూ.6.31 కోట్లు, ఎస్సీ కాలనీలకు సంబంధించిన 12,501 మీటర్లు ఉండగా రూ.4.82 కోట్లు విద్యుత్ బిల్లుల బకాయిలు చెల్లించాల్సి ఉంది. గిరిజన తండాలకు సంబంధించి 51,428 మీటర్ల ద్వారా రూ. 18.55 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. వ్యవసాయ బావులకు సంబంధించి రూ.9.07 కోట్లు బకాయిలు పడ్డాయి. ఇలా జిల్లాలో మొత్తంగా రూ.74.56 కోట్లు విద్యుత్ వినియోగదారులు బిల్లుల రూపంలో చెల్లించాల్సి ఉంది.

సెక్షన్‌ల వారీగా పరిశీలిస్తే...

జిల్లాలోని తొర్రూరు, మానుకోట డివిజన్ల పరిధిలోని 18 మండలాల్లో రూ.74.56 కోట్ల విద్యుత్ బకాయిలు ఉన్నాయి. ఇందులో మహబూబాబాద్ డివిజన్‌లో 2,02,066 మీటర్లకు గాను రూ.46.46 కోట్లు, తొర్రూరు డివిజన్‌లో 1,26,622 మీటర్లకు రూ.28.10 కోట్లు బకాయిలు ఉన్నాయి. అందులో సెక్షన్‌ల వారీగా పరిశీలిస్తే మానుకోట డివిజన్‌లోని మహబూబాబాద్ రూరల్‌లో అత్యధికంగా 23,776 విద్యుత్ మీటర్లకు గాను రూ.7.06 కోట్లు ఉండగా, అత్యల్పంగా తొర్రూరు డివిజన్‌లోని చిన్నగూడూరు పరిధిలో 5,833 మీటర్లకు గాను రూ.1.53 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇక మానుకోట డివిజన్ పరిధిలోని మహబూబాబాద్ టౌన్-1లో 15,283 మీటర్లకు గాను రూ.2.54 కోట్లు, మహబూబాబాద్ టౌన్-2 పరిధిలో 13,380 మీటర్లు ఉండగా రూ.2.02 కోట్లు, కేసముద్రం పరిధిలో 17,460 మీటర్లకు రూ.4.17 కోట్లు, ఇనుగుర్తి పరిధిలో 11,509 మీటర్లకు రూ.2.37 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి.

అయోధ్యపురంలో 11,664 మీటర్లకు రూ.2.71 కోట్లు, గూడూరులో 11,379 మీటర్లకు రూ.2.60 కోట్లు, కొత్తగూడలో 15,866 మీటర్లకు రూ.6.67 కోట్లు, కురవిలో 16,378 మీటర్లకు రూ.5.12 కోట్లు, సీరోలులో 9,572 మీటర్లకు రూ.2 కోట్లు, డోర్నకల్‌లో 21,756 మీటర్లకు రూ.5.94 కోట్లు, గార్లలో 15,870 మీటర్లకు గాను రూ.3.23 కోట్లు, కొత్తపేటలో 18,193 మీటర్లకు రూ.2.95 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇక తొర్రూరు టౌన్‌లో 19,435 మీటర్లకు రూ.3.46 కోట్లు, చిన్నవంగరలో 15,424 మీటర్లకు రూ.2.83 కోట్లు, పెద్దవంగరలో 11,264 మీటర్లకు రూ.2.14 కోట్లు, నెల్లికుదురులో 11,114 మీటర్లకు రూ.2.30 కోట్లు, మునిగలవీడు 10,898 మీటర్లకు రూ.3 కోట్లు, దంతాలపల్లిలో 12,666 మీటర్లకు రూ.2.19 కోట్లు, నర్సింహులపేట 10,436 మీటర్లకు రూ.1.99 కోట్లు, మరిపెడలో 19,308 మీటర్లకు రూ.6.34 కోట్లు, ఎల్లంపేటలో 10,304 మీటర్లకు రూ.2.29 కోట్ల విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయి.



బదిలీపై వెళ్లిన కలెక్టర్ శశాంకను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఉద్యోగులు

ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణం

- వీడ్కోలు కార్యక్రమంలో కలెక్టర్ శశాంక

మహబూబాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమేనని జిల్లా నుంచి బదిలీపై వెళ్లిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పీఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో నూతన కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు స్వాగతం పలుకుతూ.. బదిలీపై వెళ్లిన కలెక్టర్ శశాంకకు ఆదివారం రాత్రి వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. కలెక్టర్ శశాంకను జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత కలెక్టర్ శశాంక మాట్లాడుతూ... తన హయాంలో సమీకృత జిల్లా అధికారుల భవన సముదాయం, మెడికల్, ఇంజనీరింగ్, నర్సింగ్ కళాశాల భవనాలను నిర్మించడం సంతృప్తిని ఇచ్చిందన్నారు. జన్మనిచ్చిన తల్లి అందించిన ధైర్యం, తెగువ, పట్టుదల, ప్రతి పనిలోనూ ముందడుగు వేయించిందని, కన్నతండ్రి నేర్పిన నిజాయితీ, అర్ధాంగి సహకారం తోడవడంతో తనవంతు కర్తవ్యాన్ని నిర్వహించానని చెప్పారు. ఈ ప్రాంత ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల ప్రతినిధులు తనను ఆదరించి ప్రతి పనిలో భాగస్వామ్యమై సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. అదే సహకారం ప్రస్తుత కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు అందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో అంకిత్‌కుమార్, అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, జిల్లా అధికారులు రమాదేవి, సన్యాసయ్య, సూర్యనారాయణ, రామారావు, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మునిసిపల్ కార్యాలయంలో దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న చైర్మన్ రాంమోహన్‌రెడ్డి

ఆన్‌లైన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

- మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, జనవరి 8 : ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని మునిసిపల్ కార్యాలయంలో అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఏఏ పథకాలకు దరఖాస్తు చేసుకున్నారో.. ఆ విధంగా ఆన్‌లైన్ చేయాలని సూచించారు. తద్వారా ఏ పథకానికి ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారన్నది స్పష్టంగా తెలిసిపోతుందన్నారు. తప్పులు దొర్లకుండా ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేసి జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి నివేదించాలని అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ డీఈ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

గరంగరంగా జడ్పీ సర్వసభ్య సమావేశం

- అధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం
- హాజరైన కలెక్టర్, ప్రభుత్వ విప్, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్

మహబూబాబాద్ రూరల్, జనవరి 8 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా నిర్వహించిన మహబూబాబాద్ జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం గరం...గరంగా కొనసాగింది. అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. మహబూబాబాద్‌లోని జిల్లా పరిషత్ కార్యాలయంలో సోమవారం చైర్‌పర్సన్ అంగోతు బిందు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్, మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ... అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా జిల్లా అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు.

సర్వసభ్య సమావేశంలో తొలుత వ్యవసాయ శాఖకు సంబంధించిన చర్చ ఆరంభించారు. ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జిల్లాలో ఎంత మంది రైతులకు రైతు బంధు ఇచ్చారని జిల్లా ఇంచార్జి వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణను అడుగగా సరైన సమాధానం రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. తొర్రూరు జడ్పీటీసీ, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ మంగళంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ... పాలకుర్తి నియోజకవర్గ ఇరిగేషన్ ఈఈ యాసంగిలో వరినాట్లు వేయకూడదని, ఆరుతడి పంటలు వేసుకోవాలని, ప్రాజెక్టుల్లో సరిపడా నీరు లేదని రైతులకు చెప్పడమేంటని ప్రశ్నించారు. ఈ విషయంపై ఎమ్మెల్సీ రవీందర్‌రావు జోక్యం చేసుకుని ప్రభుత్వం మీకు ఆదేశాలు ఇచ్చిందా.. మీరే ఇస్తున్నారా.. అని అడిగారు. ప్రాజెక్టుల్లో మిడ్‌మానేరు, శ్రీరాంసాగర్, అన్నారం, మానేరులో ఎన్ని టీఎంసీల నీరుందో మీకు తెలుసా.. అంటూ గత ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయొద్దంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

జిల్లాలో ఎన్ని ధాన్యం కొనుగోలు సెంటర్లను ప్రారంభించారు.. ఇప్పటి వరకు ఎన్ని టన్నుల ధాన్యం సేకరించారు. రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎంత మందికి ఇచ్చిందని ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్సీ రవీందర్‌రావులు అధికారులను ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలోని దళితబంధు, మైనారిటీ, బీసీ, గృహలక్ష్మి పథకాలను అమలు చేయడంతో పాటు మాజీ సీఎం కేసీఆర్ మునిసిపాలిటీలకు, గ్రామ పంచాయతీలకు ఇచ్చిన నిధులతో మొదలు పెట్టిన అభివృద్ధి పనులను కొనసాగించాలని అన్నారు.

ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ మాట్లాడుతూ... రైతుబంధును ప్రస్తుతం ఎకరం లోపు ఉన్న రైతులకు వేశామని, దశల వారీగా మిగతా రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ప్రకటించిన ఆరు గ్యారెంటీలను పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. మిడ్ మానేరులో నీటి శాతం తగ్గిందని, దాంతోనే యాసంగిలో కొంత నీళ్లందించడంలో ఆలస్యమవుతుందని చెప్పారు.

ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ... గత ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఐదెకరాలా.. పదెకరాల వరకు రైతుబంధు ఇస్తారో స్పష్టంగా ప్రకటించాలన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షలు వస్తున్న తరుణంలో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మెడికల్ కళాశాల, ఉద్యానవన డిగ్రీ కళాశాల, సబ్ సెంటర్లు, పల్లె దవాఖానాల సగం పనులు మధ్యలో నిలిచిపోయాయని, వాటిని పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ.. జిల్లాలో 'మన ఊరు-మన బడి' కింద 316 మంజూరు కాగా, 30 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తికావడంతో డీఈవో రామారావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో ఎంత మంది ఎంఈవోలు ఉన్నారని అడుగగా ఎవరు లేరని డీఈవో చెప్పడంతో ఇలా అయితే విద్యా వ్యవస్థ ఎలా కొనసాగుతుందని రవీందర్‌రావు మండిపడ్డారు.

మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలు సరైన లబ్ధిదారులకు చేరకపోవడంతోనే ప్రజలు మార్పు కోరుకుని కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంక్షేమ పథకాలను అందిస్తామని పేర్కొన్నారు. వచ్చే ఫిబ్రవరిలో బడ్జెట్ సమావేశాలు ఉంటాయని, అందులో ఆరు గ్యారెంటీల అమలుపై స్పష్టత వస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో రమాదేవి, డిప్యూటీ సీఈవో నర్మద, వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్‌రెడ్డి, అధికారులు సన్యాసయ్య, సూర్యనారాయణ, ఈఈ కృష్ణారెడ్డి, ప్రజాప్రతినిధులు మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డి, బండి వెంకట్‌రెడ్డి, భూక్య సంగీత, లూనావత్ ప్రియాంక, సుచిత్ర, జాటోతు ఝాన్సీ, మహబూబ్ పాషా, బానోత్ సుజాత, ఎర్రబెల్లి మాధవి, ఈదురు రాజేశ్వరి, శ్రీరాంజ్యోతిర్మయి, మూల సునీత తదితరులు పాల్గొన్నారు.



తొర్రూరు మండలం గుర్తూర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు భూమి పూజ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రునాయక్

బడుగుల అభ్యున్నతే ధ్యేయం

- దొంగల చేతిలో రాష్ట్రం లూటీ అయింది
- రాజేందర్‌రెడ్డి-ఝాన్సీరెడ్డి దంపతుల సేవలు అమూల్యం
- ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రునాయక్
- గుర్తూర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు భూమి పూజ
- పాల్గొన్న ఐదుగురు ఎమ్మెల్యేలు

వివరాలు : 7లో..



గూడూరు మండలం రాములుతండాలో ఒకే కాన్పులో పుట్టిన ముగ్గురు శిశువులు

ఒకే కాన్పులో ముగ్గురు శిశువుల జననం

గూడూరు, జనవరి 8 : మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం రాములుతండాలో ఓ గర్భిణి ఒకే కాన్పులో ముగ్గురు శిశువులకు జన్మనిచ్చింది. రాములు తండాకు చెందిన బానోత్ పృథ్వీరాజ్‌తో వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పదహారుచింతల తండాకు చెందిన దివ్యకు 10 జూన్ 2022లో వివాహం జరిగింది. ఆమె గర్భం దాల్చిన తర్వాత వైద్యం నిర్వహించడంతో గర్భంలో ముగ్గురు శిశువులు ఉన్నట్లు వైద్యులు చెప్పడంతో తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఐదు రోజుల కిందట ఆమెకు పురిటినొప్పులు రావడంతో వరంగల్ జిల్లా నర్సంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. గర్భిణి దివ్యకు రక్తపోటు ఎక్కువగా ఉండడంతో వైద్యులు అదే రోజు శస్త్రచికిత్స నిర్వహించారు. దీంతో ఆమె ముగ్గురు పండంటి శిశువులకు జన్మనిచ్చింది. ఇందులో ఇద్దరు ఆడ శిశువులు కాగా, ఒక మగశిశువు ఉన్నారు. ప్రస్తుతం ముగ్గురు శిశువులతో పాటు తల్లి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మిర్చి రైతుల ఆందోళన

- తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారంటూ ధర్నా
- ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఉద్రిక్తత
- పోలీసులు, అధికారుల చొరవతో సద్దుమణిగిన సమస్య



మార్కెట్ ప్రధాన గేటు వద్ద ధర్నా చేస్తున్న రైతులు

వరంగల్ టౌన్, జనవరి 8: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు (ఖరీదుదారులు) మిర్చి ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారంటూ రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. ఉదయం మార్కెట్‌లో యథావిధిగా మిర్చి జెండా పాట (నాణ్యత గల మిర్చి ధరను నిర్ణయిస్తారు) పాడారు. తేజ రకం మిర్చికి క్వింటాకు రూ.20,100 నిర్ణయించారు. మార్కెట్‌కు వండర్ హాట్, తేజ, యూఎస్-341, దేశీ ఇలా సుమారు 20 రకాల మిర్చి అమ్మకానికి వస్తాయి. ఒక్కో రకానికి నాణ్యతను బట్టి వ్యాపారులు ధరలు నిర్ణయించి కొనుగోలు చేస్తారు. అయితే సోమవారం తేజ రకానికి క్వింటాకు రూ.20,100 జెండా పాట పాడగా వ్యాపారులు కొందరు రూ.17వేలు, ఇంకొందరు రూ.18వేలు, మరికొన్ని రూ.13వేల చొప్పున ధర నిర్ణయించి కొనుగోలుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో తక్కువ ధర పలికిన రైతులు గొడవకు దిగారు.

విషయం తెలుసుకున్న మిగతా రైతులు పెద్ద ఎత్తున చేరుకుని తమకు కూడా ధరలు తగ్గించారని, గత ఏడాదితో పోల్చుకుంటే అధ్వానంగా ఉన్నాయని ఆరోపించారు. మార్కెట్ ప్రధాన గేటు ముందు ఆందోళనకు దిగి కొద్దిసేపు ధర్నా చేశారు. సమాచారం అందుకున్న మార్కెట్ కార్యదర్శి సంగయ్య వెంటనే డీఎంవో ప్రసాదరావుకు, మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్, మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జి మల్లేశంకు పరిస్థితిని వివరించారు. అలాగే స్థానిక సీఐ మహేందర్, ఏసీపీ సతీష్ బాబు, డీసీపీ రవిందర్ దృష్టికి తీసుకెళ్లడంతో వారు మార్కెట్‌కు చేరుకున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

ఎవరి వాదన వారిదే...

వ్యాపారుల పక్షాన చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డిని, అడ్తి సెక్షన్ అధ్యక్షుడు లింగారెడ్డిని, ఆందోళన చేస్తున్న రైతులను కార్యాలయానికి పిలిపించి మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు మల్లేశం, ప్రసాద్‌రావు, ఏసీపీ సతీష్ బాబు, డీసీపీ రవిందర్ చర్చించారు. వ్యాపారులు, రైతులు ఎవరి వాదన వారిదే అన్నట్లు కొద్ది సేపు నడిచింది. నాణ్యతను బట్టి ధర పలుకుతుందని వ్యాపారులు చెప్పగా, క్వింటాకు రూ.17వేలు పలికిన మిర్చి, క్వింటా రూ.13వేలు పలికిన మిర్చి ఒకే రీతిలో ఉందని, అలాంటప్పుడు అంత తక్కువ ధరకు ఎలా కొంటారని రైతులు ప్రశ్నించారు.

మిర్చిలో నాణ్యత ఉంటే ఒక ఖరీదుదారు కాకపోతే మరో ఖరీదుదారుడికి ఎక్కువ ధరకు అమ్ముకోవచ్చని, లేదా మంచి ధర పలికినప్పుడే అమ్ముకోవాలని అప్పటి వరకు కోల్డ్ స్టోరేజీలో పెట్టుకోవచ్చని వ్యాపారులు తమ వాదన వినిపించారు. అధికారులు ఇరువర్గాలకు నచ్చచెప్పారు. తక్కువ ధర పలికిందనిపిస్తే ఆ రైతుల వద్దకు మార్కెట్ అధికారులు, ఖరీదుదారులు, పోలీసులు వచ్చి పరిశీలించి నాణ్యతకు అనుగుణంగా ధర పెట్టేందుకు మరో ఖరీదుదారుడిచే కొనుగోలు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని ఇరువర్గాలకు నచ్చచెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

చిగురించిన ఆశలు

'బిల్ట్' పునరుద్ధరణపై ప్రభుత్వం ఫోకస్

- ఐటీసీ, ఫిన్‌క్వెస్ట్ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- 2014లో మూతపడ్డ పరిశ్రమ
- చిన్నాభిన్నమైన శ్రామికుల జీవితాలు
- ఫ్యాక్టరీని తెరిపించేందుకు సర్కారు కసరత్తు
- హర్షం వ్యక్తం చేస్తున్న కార్మికులు, జిల్లా వాసులు

ములుగు, జనవరి 8 : బిల్ట్ కార్మికుల ఆశలు చిగురిస్తున్నాయి. ఫ్యాక్టరీని తెరిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు ముందుకేస్తోంది. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురంలోని ఈ కర్మాగారం 2014లో మూతపడగా దాన్ని పునరుద్ధరించేందుకు రేవంత్ సర్కారు కసరత్తు చేస్తోంది. అయితే.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇలాంటి ప్రయత్నమే చేయగా అది సఫలీకృతం కాక కార్మికుల్లో సుమారు పదేళ్లుగా నైరాశ్యం నెలకొంది. కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేయడంతో ఈసారైనా తమ కలలు సాకారం అవుతాయా..? అని కార్మికులు చర్చించుకుంటున్నారు.

ఐటీసీ, ఫిన్‌క్వెస్ట్ ప్రతినిధులతో సీఎం భేటీ

బిల్ట్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం అడుగు వేసిందని తెలుస్తోంది. నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్

మిగతా 8వ పేజీలో..



వినతుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

కలెక్టర్ సిక్తా పట్నాయక్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ రూరల్, జనవరి 8 : ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. ఫిర్యాదులపై అధికారులు కాలయాపన చేయకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 60 వినతులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ కోసం 4, జీడబ్ల్యూఎంసీ 6, ఎస్సీ కార్పొరేషన్ 2, ఆర్డీవో 5, ఎంజీఎం 1, తహసీల్దార్ 11, ఎంపీడీవో 3, ఉపాధి కార్యాలయం 3 వినతులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ మేన శ్రీను, ఇండస్ట్రీస్ జీఎం హరిప్రసాద్, మైనింగ్ విభాగం ఏడీ నర్సిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, డీడబ్ల్యూవో మధురిమ, మెప్మా పీడీ భద్రునాయక్, డీపీవో జగదీశ్వర్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు మహిళ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, జనవరి 8 : ఈనెల 10 నుంచి 14 వరకు కర్ణాటకలోని సేలం పెరియార్ యూనివర్సిటీలో నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ హ్యాండ్ బాల్ పోటీలకు కాకతీయ యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసి ప్రకటించినట్లు కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావు తెలిపారు. 2023-24 ఏడాదికిగాను కేయూ నుంచి ఎంపికైన క్రీడాకారుల వివరాలను సోమవారం ప్రకటించారు. ఎంపికైన వారిలో కె.సువర్ణ, బి.భాగ్యశ్రీ, బి.మాధవి, (యూసీపీఈ, కేయూ) ఎస్. శివరాణి,(యూసీఈటీ, కేయూ) ఎస్.నందిని, (ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్, ఖమ్మం), బి.రమ్య,(యూసీపీఈ, కేయూ), ఎం.కరీన, (టీటీడబ్ల్యూఆర్‌డీసీ(ఉమెన్స్),ఆసిఫాబాద్), కె.రమ్య (వీసీపీఈ, బొల్లికుంట), బి. రేహజు, (టీటీడబ్ల్యూఆర్‌డీసీ, ఉమెన్స్ ఖమ్మం), కె.సింధూజ, (టీటీడబ్ల్యూఆర్‌డీసీ, ఉమెన్స్ ఉట్నూర్), ఎం.రచన, (యూసీపీఈ, కేయూ), సీహెచ్. మౌనిక (టీటీడబ్ల్యూఆర్‌డీసీ, ఉమెన్స్ ,ఉట్నూర్), టి.స్నేహ, (వీసీపీఈ, బొల్లికుంట), సీహెచ్.శివాని (టీటీడబ్ల్యూఆర్‌డీసీ, ఉమెన్స్, మంచిర్యాల) ఇ.వెన్నెల (టీటీడబ్ల్యూఆర్‌డీసీ (ఉమెన్స్), కొత్తగూడెం),వి.రిషిత, (టీటీడబ్ల్యూఆర్‌డీసీ(ఉమెన్స్), మంచిర్యాల)లు ఎంపికైయారు. వీరికి కొత్తగూడెం సింగరేణి ఉమెన్స్ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.సావిత్రి మేనేజర్‌గా వ్యవహరిస్తారు. ఎంపికైన జట్టు కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావులు అభినందించారు.

క్యాంపు కార్యాలయంలో నాయిని పూజలు



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పూజల నిర్వహణలో నాయిని రాజేందర్ రెడ్డి, ఆయన సతీమణి నీలిమారెడ్డితో పాటు సీపీ అంబర్ కిషోర్ ఝా

హనుమకొండ సిటీ, జనవరి 8 : హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు సోమవారం పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేగా గెలిచాక తన సతీమణి నీలిమారెడ్డి, అల్లుడు విష్ణువర్ధన్‌రెడ్డి, కూతురు గోదారెడ్డి ఇతర కుటుంబ సభ్యులతో కలిసి కార్యాలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఏసీపీ కిరణ్‌కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జీవీయస్ శ్రీనివాసాచార్యులు, ఈవీ శ్రీనివాస్, తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, వేద పండితులు విజయకుమారాచార్యులు, అరవింద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాల్సిందే..

కాజీపేట, జనవరి 8 : నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట ఎంప్లాయీస్ సంఘ్ నాలుగు రోజుల రిలే దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సాధినేని వెంకటనారాయణ దీక్షలను ప్రారంభించారు. అనంతరం సీడబ్ల్యూసీ మెంబర్ చింత మురళి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ విధానాన్ని వెంటనే ఎత్తివేయాలని, పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల డబ్బును షేర్ మార్కెట్‌లో పెట్టి జూదం ఆడుతుందన్నారు. పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు అని, ఆ హక్కును ప్రభుత్వం కాలరాస్తుందని విమర్శించారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసేంతవరకు ఉద్యమించి తీరుతామన్నారు. ఈ దీక్షలను స్థానిక కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీ రజాలీ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలో జమ్మికుంట బ్రాంచ్ సెక్రటరీ నర్సింగరావు, ఆపరేటింగ్ బ్రాంచ్ సెక్రటరీ ముస్తాక్ హుస్సేన్, వర్కింగ్ చైర్మన్ నారాయణ, కె. రవి, వరప్రసాద్ రెడ్డి, లక్ష్మీనారాయణ, ఏకాంబరం, బల్వీందర్ సింగ్, అజీజ్ పాషతోపాటు రైల్వే కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రైల్వేలను నిర్వీర్యం చేస్తున్న ప్రధాని మోదీ

రైల్వేలను ప్రధానిమోదీ పూర్తిగా నిర్వీర్యం చేస్తూ రైల్వే కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. చుక్కయ్య అన్నారు. నూతన పెన్షన్ విధానాన్ని నిలిపివేయాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట సోమవారం రైల్వే దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల దీక్షలను ప్రారంభించారు. ఈ దీక్షలను సీపీఎం నేత ఎం. చుక్కయ్య, స్థానిక కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీ రజాలీలు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నేత చుక్కయ్య మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైల్వేలో ఖాళీలను భర్తీ చేయకుండా నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేయడమే కాకుండా రైల్వే కార్మికు లపై పనిభారాన్ని పెంచుతూ తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. ఈ నిరసన దీక్షలో నాయకులు ఓరుగంటి సాంబయ్య, కొండ శ్రీనివాస్, ఎస్‌కే.అఫ్జల్ పాల్గొన్నారు. దీక్షలో కూర్చున్న వారిలో యూనియన్ ఆల్ బ్రాంచ్ కో- ఆర్డినేటర్ నాయిని సదానందం, దాడబోయిన శ్రీనివాస్ యాదవ్, సంగ రమేశ్, ఈ. రాజేందర్, కె. బాల మురళీ రాజ్, సమ్మయ్య తదితరులు ఉన్నారు.

టీ- ఎమ్మార్పీఎస్‌కు పలువురి రాజీనామా

వడ్డెపల్లి, జనవరి 8: తెలంగాణ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి మాదిగ అనుసరిస్తున్న తీరుకు నిరసనగా రాజీనామా చేస్తున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వక్కల వెంకట్ మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నత్తి కోర్నెల్ మాదిగ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పాముల రమేష్ మాదిగ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

టెన్త్‌లో 100 శాతం ఫలితాలు సాధించాలి

హనుమకొండ రూరల్, జనవరి 8: పదవ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయులతో టెన్త్ ఫలితాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యార్థుల హాజరుశాతంపై అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించారు. ఇక నుంచి ఉత్తమ ఫలితాల సాధనకు ప్రతీ వారం ప్రధానోపాధ్యాయులతో సమీక్ష ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ అబ్దుల్ హై, జిల్లా గుణాత్మక విద్య సమన్వయ అధికారి ఎ.శ్రీనివాస్, రాధ, సునీత, విజయ్ కుమార్, రామ్‌కిషన్‌రాజు, వెంకటేశ్వర్‌రావు, రమాదేవి పాల్గొన్నారు.

కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి

ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ ఫైనాన్స్ (ఇన్‌చార్జి) తిరుపతిరెడ్డి



విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

హనుమకొండ రూరల్, జనవరి 8: కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి ప్రతి ఒక్కరూ అహర్నిశలు కృషి చేయాలని ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ ఫైనాన్స్ (ఇన్‌చార్జి) వంటేరు తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ హంటర్ రోడ్‌లోని దీప్య భవన్‌లో ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేసన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా వంటేరు తిరుపతిరెడ్డి, విశిష్ట అతిథులుగా విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.అశోక్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంకితభావంతో పని చేసి కంపెనీని ఆర్థికంగా బలోపేతం చేయడంలో అకౌంట్స్ ఆఫీసర్ల పాత్ర కీలకమన్నారు. సమష్టి కృషితోనే ఏదైనా సాధించే సత్తా మనందరిలో ఉందని, ఈపీఎఫ్ టు జీపీఎఫ్ విషయంలో ప్రభుత్వానికి నివేదించి వచ్చే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. ఉద్యోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని వారు తెలిపారు.

అనంతరం టీఎస్ ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా వేణుబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్.ఉపేందర్, ఉపాధ్యక్షులుగా కె.నవీన్ కుమార్, బి.వసంత్‌రావు, ఎస్.లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా ఎం.సుదర్శన్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా ఇ.మురళి, చంద్రమోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బి.లక్ష్మణ్, రేష్మ, ఫైనాన్స్ సెక్రటరీగా బి.దేవేందర్, మహిళా కార్యదర్శిగా ఎం.సునీత ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీడీసీఎల్ అదనపు కార్యదర్శి ఎ.నాగరాజు, అన్ని జిల్లాల కార్యవర్గ సభ్యులు, జనరల్ మేనేజర్లు, ఎస్ఏఓలు, ఏఏఓలు, జేఏఓలు పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతే ధ్యేయం

దొంగల చేతిలో రాష్ట్రం లూటీ అయింది

రాజేందర్‌రెడ్డి-ఝాన్సీరెడ్డి దంపతుల సేవలు అమూల్యం

ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రునాయక్

గుర్తూర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు భూమి పూజ

పాల్గొన్న ఐదుగురు ఎమ్మెల్యేలు



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు

తొర్రూరు రూరల్, జనవరి 8 : బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం గుర్తూర్ గ్రామంలో ఎన్ఆర్ఐ హనుమాండ్ల రాజేందర్‌రెడ్డి-ఝాన్సీరెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సొంత ఖర్చుతో నిర్మిస్తున్న హనుమాండ్ల లక్ష్మమ్మ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భూమి పూజ కార్యక్రమాన్ని విప్ రాంచంద్రునాయక్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్‌లతో కలిసి సోమవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ మాట్లాడుతూ ఎంతో మంది యువకుల ప్రాణత్యాగాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం దొంగల చేతిలో పడి లూటీ అయిందన్నారు. అలాంటి దొంగలను ప్రజలు తరిమికొట్టి మార్పు కోరుకుంటూ విద్యావంతులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. రాజకీయాల్లోకి రాకుండానే 40 ఏళ్లుగా సేవ చేస్తున్న డాక్టర్ హనుమాండ్ల రాజేందర్‌రెడ్డి-ఝాన్సీరెడ్డిలు సేవాతత్పరులని, ఈ ప్రాంతం వారు కావడం అదృష్టమన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయగల సమర్థులని, ఇలాంటి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను అనేకంగా ఏర్పాటు చేయడానికి ముందుకురావాలని కోరారు.

మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాక్షస పాలనను అంతం చేసి శాంతియుత పాలనకు స్వాగతం పలికిన ప్రజలను కాపాడుకోవడానికి ఝాన్సీ రుద్రమ్మవలే ముందుకు వచ్చారన్నారు. యువతలో నైపుణ్యం వెలికితీస్తేనే స్వయం శక్తులుగా ఎదుగుతారని, అందుకోసం పాటుపడుతున్న రాజేందర్‌రెడ్డి-ఝాన్సీరెడ్డి దంపతులకు ఎల్లప్పుడు అండగా ఉంటామన్నారు.

ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నన్ని రోజులు దోపిడీకి పాల్పడారని, వారంతా ఐపీసీ 390 పరిధిలోకి వచ్చే వాళ్లన్నారు. మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ దోపిడీ దారులకు అడ్డుకట్ట వేసి, బడుగుల అభివృద్ధి కోసం విద్యావంతులను అసెంబ్లీకి తీసుకెళ్లిన కాంగ్రెస్ పేదల పక్షపాతి అన్నారు.

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ పుట్టిన గడ్డకు సేవ చేయాలనే తన అత్తామామలు హనుమాండ్ల రాజేందర్‌రెడ్డి-ఝాన్సీరెడ్డి స్ఫూర్తితో ఇచ్చిన మాటకు కట్టుబడి అభివృద్ధి చేస్తామని అన్నారు. యువతలో నైపుణ్యాన్ని వెలికి తీసినప్పుడే అభివృద్ధి చెందుతారని, కుటుంబంలో ఒక్కరికి ఉపాధి లభిస్తే కుటుంబం అంతా సంతోషంగా ఉంటుందన్నారు. వాళ్ల పడ్డ కష్టాలు ఎవ్వరూ పడవద్దనే ఉద్దేశ్యంతోనే యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో ప్లంబింగ్, బ్యూటీషియన్, చేనేత తదితర పనులపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

డాక్టర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ తమపై నమ్మకంతో తమ కోడలిని గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోవడం కోసం, పాలకుర్తిని అభివృద్ధి చేయడానికి శక్తినంతా ధారపోస్తానని అన్నారు. ఈ గెలుపు తమది కాదని, ప్రజల గెలుపేనని అన్నారు.

ఒకే వేదికపై ఐదుగురు ఎమ్మెల్యేలు

పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు మండలం గుర్తూర్ గ్రామంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పనుల శంకుస్థాపనకు ఐదుగురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రునాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజులకు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ఆతిథ్యం ఇచ్చారు.

నేడు పట్టుకున్న వాహనాల వేలం

హనుమకొండ క్రైం, జనవరి 8: హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో తనిఖీలలో పట్టుకున్న రెండు వాహనాలను మంగళవారం ఉదయం సర్క్యూట్ గెస్ట్‌హౌస్ సమీపంలోని హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్‌లో వేలం వేయనున్నట్టు ఆబ్కారీ శాఖ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక బొలెరో వాహనం, ఒక ద్విచక్రవాహనం వేలం వేయనున్నట్టు తెలిపారు. ఉదయం 9 గంటలకు వేలం పాట ప్రారంభం అవుతుందని 50 శాతం దరావత్ సొమ్మును చెల్లించిన తర్వాత పాటలో పాల్గొనాలని రామకృష్ణ తెలిపారు.

మేడారంలో ముమ్మరంగా పనులు



జంపన్నవాగులో ఇసుక పోస్తున్న దృశ్యం



స్నాన ఘట్టాలను శుభ్రం చేస్తున్న కూలీలు

మేడారం, జనవరి, 8 : తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క సారలమ్మల మహా జాతర ఫిబ్రవరి 21 నుంచి జరగనున్న నేపథ్యంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు ఆయా పనులు చేపడుతున్నారు. జాతర తొలిరోజు కన్నెపల్లి నుంచి మేడారం గద్దెలకు సారలమ్మ జంపన్న వాగు మీదుగా చేరుకోనున్న నేపథ్యంలో పలు పనులకు శ్రీకారం చుట్టారు. వాగులోని లోతట్టు ప్రదేశంలో టిప్పర్ల సహాయంతో ఇసుకను పోస్తూ మరమ్మతులు చేస్తున్నారు. అలాగే జాతరలో భక్తుల కోసం స్నాన ఘట్టాలను నీటిపారుదల శాఖ అధికారులు సోమవారం ప్రారంభించారు. స్నానాల కోసం బ్యాటరీ ట్యాప్స్, మహిళలు బట్టలు మార్చుకునే గదులు సిద్ధం చేస్తున్నారు. ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల్లో పూడికతీత పనులను ముమ్మరం చేశారు. సంక్రాంతి పండుగ లోపు అమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉండేలా చర్యలు చేపడుతున్నారు.

పరిశీలించిన ఐటీడీఏ పీవో

మహాజాతరలో భక్తుల సౌకర్యార్థం నీటిపారుదల చేపడుతున్న పనులను ఐటీడీఏ పీవో అంకిత్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. పంచాయతీ రాజ్ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని డీఈ సదయ్యకు సూచించారు. అనంతరం ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల పూడికతీత, స్నాన ఘట్టాల వద్ద బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్, ఆదివాసీ మ్యూజియం సుందరీకరణ పనులు పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో వసంతరావు, ఎస్‌వోఎం రాజ్‌కుమార్, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.

కేయూ హాస్టల్స్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ శ్రీనివాసరావు



కేయూ క్యాంపస్, జనవరి 8 : కాకతీయ యూనివర్సిటీ నూతన హాస్టల్స్ డైరెక్టర్‌గా కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు హాస్టల్స్ డైరెక్టర్‌గా ఉన్న జువాలజీ విభాగం ప్రొఫెసర్ వై.వెంకయ్య స్థానంలో శ్రీనివాసరావును నియమించారు. జనవరి 9న మంగళవారం వెంకయ్య నుంచి పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. సోమవారం కేయూ పరిపాలన భవనంలో కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందుకున్నారు. గతంలో కేయూలో శ్రీనివాసరావు దివ్యాంగుల సెల్ డైరెక్టర్‌గా, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్ల జాయింట్ డైరెక్టర్‌గా, క్యాంపస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా, ప్రభుత్వ పాలన శాస్త్రం, హెచ్ఆర్ఎం విభాగాధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా, విభాగాధిపతిగా కొనసాగుతున్నారు.

నేరస్థులకు శిక్షపడే కేసులు నమోదు చేయాలి

మానవహక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాదావత్ రాజు

ఐనవోలు, జనవరి 8: నేరస్థులు తప్పుచేసి తప్పించుకోకుండా శిక్షపడే కేసులనే నమోదు చేయాలని మానవహక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాదవత్ రాజు డిమాండ్ చేశారు. ఒంటిమామిడిపల్లిలో డిసెంబరు 25న మంత్రాల నెపంతో గోనె సోమలక్ష్మి(65) అనే వృద్ధురాలిని హత్యచేశారు. ఈ సంఘటనపై మానవహక్కుల వేదిక బృందం నిజనిర్ధారణ కోసం ఒంటిమామిడిపల్లి గ్రామంలో బాధితురాలి ఇంటిని సందర్శించి కుటుంబసభ్యులతో మాట్లాడి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. సోమలక్ష్మి దగ్గరి బంధువైన గోనె పెద్దరాజు కుమారుడు గోనె మధు డిసెంబరు 17న వ్యక్తిగత కారణాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తమ కుమారుడు ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలను తెలుసుకునేందుకు మృతుడి తల్లిదండ్రులు దేవుడు చెప్పేవారి వద్దకు వెళ్లి అడిగించుకున్నారని తెలిపారు. దేవుడు చెప్పేవారు మీ సమీప బంధువు (చేతబడి) మంత్రాలు చేయడం వల్లే మీ కుమారుడు చనిపోయాడని చెప్పడంతో రాజు కుటుంబసభ్యులు సోమలక్ష్మిని హత్యచేశారని తెలిపారు. పోలీసులు సకాలంలో నిందితులను గుర్తించినప్పటికీ మూఢ నమ్మకాలను నమ్మి హత్య చేశారని వారిపై పోలీసులు కేసు నమోదు చేయలేదని తెలిపారు. కేవలం హత్యచేశారని కేసు నమోదు చేయడంతో సరైన సాక్షాధారాలు ప్రత్యక్ష సాక్షులు లేరని కేసు నీరుగారి నిందితులు బయటకు వస్తారన్నారు. పోలీసులు కేవలం హత్యకేసు కాకుండా సంఘటనా స్థలంలో లభించే వాస్తవ ఆధారాలతో హత్య చేశారని కేసు నమోదు చేస్తే నిందితులకు శిక్ష పడుతుందన్నారు. మూఢనమ్మకాల నిరోధక చట్టం తీసుకరావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేదిక రాష్ట్ర కార్యదర్శి టి. హరికృష్ణ, ఉమ్మడి జిల్లా కార్యదర్శి దిలీప్ పాల్గొన్నారు.

ఎంజీఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా



కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్

హనుమకొండ అర్బన్, జనవరి 8 : ఎంజీఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని ఎంజీఎం సూపరిం టెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ అన్నారు. ప్రజారోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం (ఐఎన్ టీయూసీ) ఎంజీఎం బ్రాంచ్ ప్రెసిడెంట్ గద్దెల ప్రేమలత అధ్యక్షతన సోమవారం నూతన సంవత్సర సంబరాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంజీఎం సూపరింటెం డెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ కేక్ కట్ చేసి మా ట్లాడారు. ఎంజీఎం ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్, కొప్పు ప్రసాద్, ప్రేమలత, ఎంజీ ఎం బ్రాంచ్ ఫార్మసీ సూపర్‌వైజర్ ఎంకి పద్మావతి, సునీత, రాజ్యలక్ష్మీ, ప్రీతి, సజని, సుప్రియ, సరళారాణి, సల్మా, శ్యామల, సృజన, ఉదయకృష్ణ, రమాదేవి, భిక్షపతి, ఉమాదేవి, జమున, సుచరిత, అనురాధ తదిత రులు పాల్గొన్నారు.

కేయూ ఏబీవీపీ నూతన కమిటీ ఎంపిక

అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రశాంత్, శ్రావణ్



ప్రశాంత్ శ్రావణ్

కేయూ క్యాంపస్, జనవరి 8 : కాకతీయ యూనివర్సిటీ అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నూతన అధ్యక్షుడిగా కొక్కుల ప్రశాంత్, కార్యదర్శిగా బొండ్ల శ్రావణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం కేయూ న్యూబాయ్స్ హాస్టల్‌లో ఏబీవీపీ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోరెడ్డి బుచ్చిరెడ్డి, ఏబీవీపీ వరంగల్ విభాగ సంఘటన మంత్రి కుంట హర్షవర్ధన్, ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాంబాబులు హాజరై కేయూ కమిటీ వివరాలను ప్రకటించారు. అధ్యక్ష, కార్యదర్శులతో పాటు వైస్ ప్రెసిడెంట్స్ లక్ష్మణ్, అశోక్, నవీన్, చరణ్, రాజు, లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీస్‌గా రాజు, అజయ్, రఘు, సాయి, ప్రకాశ్, యశ్వంత్, శివ తదితరులు ఎంపికైయారు. ఈ సమావేశంలో నూతన కమిటీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాంబాబు, కేయూ ఇన్‌చార్జి నిమ్మల రాజష్, రాష్ట్ర నాయకులు అంబాల కిరణ్, చట్ల సతీశ్, పెండ్ల అమర్, గట్టు ప్రశాంత్, సాయి విద్యార్థులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తులు

హనుమకొండ రూరల్, జనవరి 8 : 2023-24 విద్యా సంవత్సరానికి ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియేట్‌లలో ఈ నెల 11వ తేదీలోపు చివరి అవకాశంగా అపరాధ రుసుంతో అడ్మిషన్ పొందవచ్చునని డీఈవో అబ్దుల్ హై, ఉమ్మడి వరంగల్ జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ మురాల శంకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ ఫీజు www.telanganaopenschool.org ఆన్‌లైన్‌లో చెల్లించి రశీదు పొందాలన్నారు. పూర్తి వివరాలకు 80084 03631, 93963 37572 సెల్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జీటీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రకాశ్, ఉపాధ్యక్షుడిగా రవి



తాళ్ళపెల్లి ప్రకాశ్ దుర్గం రవి

ఖిలావరంగల్, జనవరి 8: ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (జీటీఏ) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా తాళ్ళపెల్లి ప్రకాశ్, ఉపాధ్యక్షుడుగా దుర్గం రవిలు ఎన్నికయ్యారని టీజీఏ రాష్ట్ర సంఘం గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు చెన్నూరి వెంకట విమాదిత్య ప్రకటనలో తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఎన్నికలలో ప్రకాశ్, రవిలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు పేర్కొన్నారు. వరంగల్ నగరానికి చెందిన వీరు రెండేళ్లపాటు కమిటీలో కొనసాగుతారన్నారు.

కేయూ హాస్టల్స్‌లో అవినీతిపై విచారణ జరిపించాలి

ఎస్ఎఫ్ఐ, బీఎస్ఎఫ్ నేతల డిమాండ్

కేయూ క్యాంపస్, జనవరి 8: కేయూ హాస్టళ్లలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై న్యాయ విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా సెక్రటరీ మంద శ్రీకాంత్, బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జి కల్లెపల్లి ప్రశాంత్ డిమాండ్ చేశారు. కేయూలో జరిగిన సమావేశంలో సోమవారం వారు మాట్లాడారు. నాణ్యతలేని పాలు, పెరుగు, కిరాణ సామాన్లను పంపిణీ చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్య లు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించకుండా కాంట్రాక్టర్లతో అధికారులు కుమ్మక్కై నాణ్యతలేని సరుకులను సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. వర్సిటీ అధికారులు తమకు అనుకూ లమైన వారికి కాంట్రాక్టర్లు ఇప్పించుకుంటున్నారని మండిపడ్డారు. నాసిరకం ఆహార పదా ర్థాలు సరఫరాతో విద్యార్థులు తరుచుగా అనారోగ్యానికి గురవుతున్నారని చెప్పారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు హతిరాం, జిల్లా కమిటీ సభ్యుడు స్టాలిన్, జస్వంత్, రోహిత్, బీఎస్ఎఫ్ నాయకులు మధు, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

మహబూబాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అద్వైత్‌కుమార్‌సింగ్‌ను ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు రాంచంద్రునాయక్ పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎంఆర్ రైస్ లక్ష్యాలను త్వరగా పూర్తి చేస్తాం : కలెక్టర్

మహబూబాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ రైస్ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ తెలిపారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సీఎంఆర్ రైస్ లక్ష్యాలపై సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వివరిస్తూ... వానాకాలంకు సంబంధించి 1.56 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి 82వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్‌ను పూర్తి చేసి పంపించినట్లు తెలిపారు. అదేవిధంగా యాసంగి పంటకు సంబంధించి 95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండగా 15 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని డెలివరీ చేసినట్లు చెప్పారు. జనవరి 31లోగా లక్ష్యాలను పూర్తి చేస్తామని వివరించారు. ఈ వీసీలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, సివిల్ సప్లై డీఎం కృష్ణవేణి, పౌర సరఫరాల శాఖ అధికారి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి

మహబూబాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 71 దరఖాస్తులను స్వీకరించారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాక తొలి గ్రీవెన్స్ సెల్ కావడంతో ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి దరఖాస్తుదారుడితో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. సంబంధిత అధికారితో వెంటనే మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఆలస్యం చేయకుండా పరిష్కారం చూపి గ్రీవెన్స్‌పై మరింత నమ్మకాన్ని పెంచాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, జడ్పీ సీఈవో రమాదేవి పాల్గొన్నారు.

తోపుడు బండ్ల కార్మికులపై పన్ను భారం మోపొద్దు

సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి



చైర్మన్ రాంమోహన్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందిస్తున్న అజయ్‌సారథిరెడ్డి, నేతలు

మహబూబాబాద్ టౌన్, జనవరి 8 : రెక్కాడితే డొక్కాడని వీధి వ్యాపారులు, తోపుడు బండ్ల కార్మికులపై మునిసిపల్ పన్ను భారం మోపవద్దని సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. ఈ మేరకు మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చైర్మన్ రాంమోహన్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ... వీధి వ్యాపారులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కుటుంబ పోషణ, జీవనోపాధి కోసం రోడ్ల వెంట చిరువ్యాపారులు, తోపుడు బండ్ల కార్మికులు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్నందున పన్నుల పేరుతో ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. సంవత్సరానికి ప్రతి కార్మికుడి వద్ద నుంచి రూ.3600 వసూలు చేయాలన్న ఆలోచనను విరమించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రేషపల్లి నవీన్, వెలుగు శ్రావణ్, కొండమీది రవి, ఎస్కే. దస్తగిరి, గణపతి, భద్రయ్య పాల్గొన్నారు.

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

మహబూబాబాద్ టౌన్, జనవరి 8 : మహబూబాబాద్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌ను కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇటీవల మానుకోట జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అద్వైత్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణం, నిలిచిపోయిన స్మృతివనం పనులను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, బానోత్ ప్రసాద్‌నాయక్, అంబాల శివకుమార్, పిండ్రాల రాందాస్, పిల్లి కృష్ణ, గాంధీ వీరన్న, ప్రవీణ్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్



కురవి మండల సభలో మాట్లాడుతున్న విప్ రాంచంద్రునాయక్

కురవి, జనవరి 8 : పార్టీలకు అతీతంగా డోర్నకల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులందరూ సహకరించాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. సోమవారం నిర్వహించిన కురవిమండల సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా గెలవగానే సర్పంచుల పదవీకాలం పూర్తి కావడానికి రావడం దురదృష్టకరమన్నారు. గత ప్రభుత్వ పాలనలో సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. సర్పంచులు, ఎంపీటీసీల ఎస్టీఎఫ్ సీడీఎఫ్ బిల్లులు వచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉన్న సర్పంచులు తిరిగి మళ్లీ ఎన్నికయ్యే అవకాశం ఉందన్నారు. ఆరు గ్యారెంటీలను రానున్న వంద రోజుల్లో తప్పక అమలు చేస్తామన్నారు. ఆరు గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణతో మండలాల వారీగా సమీక్ష చేయలేకపోయానని, సంక్రాంతి పండుగ తర్వాత అన్ని మండలాల్లో సమీక్షలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఎంపీపీ గుగులోతు పద్మావతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీడీవో సరస్వతి, సీరోలు తహసీల్దార్ నరేష్, ఎంపీవో రఘుపతిరెడ్డి, ఏపీవోయాకాంబ్రం, ఏఈలుప్రీతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ కృషి అభినందనీయం

కురవి : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి టీపీటీఎఫ్ కృషి అభినందనీయమని ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ అన్నారు. కురవిలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం టీపీటీఎఫ్ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉపాధ్యాయ సమస్యలపై టీపీటీఎఫ్ చేస్తున్న పోరాటాలు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు గుండ్ల విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఓదెల శివకుమార్, దైద వెంకటేశ్వర్లు, మధుసూదన్, సింగం మనోహర్, విజయ్‌రాజ్, శీలం వెంకటరాజు, పూర్ణచందర్, బలరాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

దంతాలపల్లి : రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. సోమవారం మండలంలోని కుమ్మరికుంట్లలోని దేవాలయంలో ఆయన పూజలు చేశారు. అనంతరం మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కార్యకర్తలతో మాట్లాడుతూ పట్టభద్రులు తప్పనిసరిగా తమ పేరును ఓటు హక్కు పొందేందుకు ఆన్‌లైన్‌చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆరు గ్యారెంటీలు త్వరలో అందనున్నాయన్నారు. నెల లోపు అర్హులందరికీ తెల్లరేషన్ కార్డును ఇస్తామన్నారు. వంద రోజుల్లో ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. రైతు రుణమాఫీతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లను ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కొత్త కొమురెల్లి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్ షురూ

తొర్రూరు రూరల్, జనవరి 8: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను ప్రజలకు అందించాలనే లక్ష్యంతో తీసుకున్న ప్రజా పాలన దరఖాస్తులను అధికారులు ఆన్‌లైన్ చేయడంలో నిమగ్నమైయారు. దీంతో తొర్రూరు మండలంలోని 29 గ్రామాల నుంచి వచ్చి సుమారు 17వేల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. అందుకోసం ప్రత్యేకమైన యాప్ ద్వారా సోషల్ వెల్ఫేర్ పాఠశాలలలో నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియను ఎప్పటికప్పుడు వేగవంతం చేయాలని తహసీల్దార్ వినోద్ కుమార్, ఎంపీడీవో కుమార్, ఎంపీవో గౌసలు పర్యవేక్షిస్తున్నారు. ఈ మేరకు తొర్రూరు ఆర్డీవో నర్సిహ ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి



భిక్షం (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, జనవరి 8 : మహబూబాబాద్ జిల్లా కేంద్రం కొత్త కలెక్టరేట్ సమీపంలో ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. మహబూబాబాద్ టౌన్ హెడ్‌కానిస్టేబుల్ సత్తయ్య తెలిపిన ప్రకారం... జిల్లాలోని గూడూరు మండలం బొద్దుగొండ గ్రామానికి చెందిన అప్పాల భిక్షం(55) కుల వృత్తిలో భాగంగా చేపలు పడుతూ.. జీవనం కొనసాగిస్తున్నారు. ఈ నెల 5న ఉదయం కొత్త కలెక్టరేట్ సమీపంలో గుడిసెలు వేస్తున్నారన్న సమాచారంతో అక్కడికి చేరుకున్నాడు. నాటి నుంచి నేటి వరకు అతని ఆచూకీ లభించకపోవడంతో బంధువుల ఇండ్లలో వాకబు చేశారు. గుడిసెల సమీపంలోని ఓ రైతు వ్యవసాయ బావిలో భిక్షం విగత జీవిగాతేలాడు. గమనించిన గుడిసెవాసులు కుటుంబసభ్యులకు సమాచారం అందించగా వచ్చి భిక్షంగా గుర్తించారు. ఆపై పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సత్తయ్య తెలిపారు. అతనికి భార్య ఉపేంద్ర, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గౌడ సహకార పరపతి సంఘం డివిజన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్



తొర్రూరు, జనవరి 8 : గౌడ సహకార పరపతి సంఘం తొర్రూరు డివిజన్ అధ్యక్షుడిగా దీకొండ శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికైనట్లు గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సోమవారం పట్టణ కేంద్రంలో గౌడ సహకార పరపతి సంఘం 19వ వార్షిక సమావేశాన్ని తాళ్ళపెల్లి హేమాద్రి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా దీకొండ శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా జలగం శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారిగా బాలగాని నరసయ్యగౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం గౌడ కులస్తులకు బీసీ రుణాల్లో ప్రాధాన్యత కల్పించాలని, గౌడ కులస్తులకు ప్రత్యేక పథకాలు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో గోపా జిల్లా ఉపాధ్యక్షుడు పెరుమాళ్ళ రమేష్‌గౌడ్, మండల అధ్యక్షుడు రాయపల్లి యాకయ్యగౌడ్ , కుమారస్వామి, రమేష్, కుమార్‌గౌడ్, జనార్దన్, రత్నశేఖర్, ముత్తి లింగంగౌడ్, ఎల్లాగౌడ్, వెంకన్న, నరసయ్య, నగేష్, కుమార్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'ఎస్మా'ను రద్దు చేయాలని అంగన్‌వాడీల నిరసన



మరిపెడ ఐసీడీఎస్ ఆఫీస్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

మరిపెడ, జనవరి 8: ఏపీ ప్రభుత్వం అంగన్‌వాడీటీచర్లు, హెల్పర్లపై ప్రయోగిస్తున్న ఎస్మా చట్టాన్ని తక్షణం రద్దుచేయాలని ఆ యూనియన్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు బెస్త సంపూర్ణ డిమాండ్ చేశారు. సోమవారం మరిపెడ ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌కు చెందిన పలువురు అంగన్‌వాడీ యూనియన్ బాధ్యులు ఇక్కడి ఐసీడీఎస్ ఆఫీస్ దగ్గర నిరసన వ్యక్తం చేయగా, ఆమె పాల్గొని మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైస్ జగన్మోహన్‌రెడ్డి గత ఎన్నికలప్పుడు అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు ఉద్యోగ భద్రత కలిపిస్తానని హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. శాంతియుతంగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం సీఎం జగన్ మూర్ఖత్వమన్నారు. ఎస్మా చట్ట జీవో 2ను రద్దు చేయకుంటే దేశ వ్యాప్తంగా అంగన్‌వాడీ ఉద్యోగులం ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. మరిపెడ ప్రాజెక్ట్ యూనియన్ బాధ్యులు జ్యోతి, రమాదేవి, స్వర్ణ, పుష్ప, మంగమ్మ, కళ, శివకుమారి, ఉమారాణి, కవిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



జిల్లాలోని రాంసింగ్‌తండాలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్న వైద్యాధికారులు


నెహ్రూసెంటర్, జనవరి 8 : ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర చేపట్టినట్లు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సీఎంవో డీజీహెచ్ఎస్ డాక్టర్ పూర్ణిమ తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరు పీహెచ్‌సీ పరిధిలో దుబ్బతండా, రత్తిరాంతండా, నెల్లికుదురు పీహెచ్‌సీ పరిధిలో రత్తిరాంతండా, కంబాలపల్లి పీహెచ్‌సీ పరిధిలో సంద్రాలగూడెం, కురవి పీహెచ్‌సీ పరిధిలో కొర్లకుంటతండాల్లో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర చేపట్టి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ... ప్రజలు అసంక్రమిత వ్యాధులు, అధిక రక్తపోటు, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, బీపీ, షుగర్ లాంటి వ్యాధులను ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సంకల్ప యాత్ర వెహికిల్ ద్వారా జిల్లాలోని వివిధ మండలాల్లో గ్రామపంచాయతీల వారీగా ప్రతిరోజు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో డీఎంహెచ్‌వో అంబరీష్, డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీధర్, డాక్టర్ శ్రీధర్, నాగేశ్వర్‌రావు, వంశీకృష్ణ, మౌనిక, విరాజిత, కృష్ణార్జున్‌రావు,రుద్రపతి, విజయ్‌కుమార్, వడ్డెబోయిన శ్రీనివాస్, రుక్నోద్దీన్, కెవి.రాజు, దాసరి గీత పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు చేయూతనివ్వాలి

కేసముద్రం, జనవరి 8 : పేద, బలహీన వర్గాలు అధికంగా చదివే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రతీ ఒక్కరు తమ వంతు చేయూతనిచ్చి వారి భవిష్యత్తుకు సహకరించాలని జిల్లా అడిషనల్ పోలీస్ సూపరింటెండెంట్ జోగుల చెన్నయ్య సూచించారు. కేసముద్రం స్టేషన్ జడ్పీ హైస్కూల్‌లో సోమవారం అంబటి లక్ష్మమ్మ ఆధ్వర్యంలో ఏఎల్ మల్లయ్య జ్ఞాపకార్థం రూ.30వేల విలువైన వాటర్ కూలర్‌ను ఏఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉత్తమ ఫలితాలను పొంది తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ భట్టు శ్రీను, హెచ్ఎం బి.రాజు, అంబటి లక్ష్మమ్మ, సుధాకర్, సంతోష్, కృష్ణవేణి, ఎస్ఎంసీ చైర్మన్ దళ్వాయి శ్రీను పాల్గొన్నారు.

సరైన మార్కెటింగ్ వ్యవస్థతోనే ప్రయోజనం

ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్



ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

కేసముద్రం, జనవరి 8: రైతులు పండించిన, తయారు చేసిన ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ వ్యవస్థ సౌకర్యం ఉంటేనే వారికి ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. కేసముద్రంలోని అంగడి ప్రాంతంలో సోమవారం 750 మంది సభ్యులతో నాబార్డు అనుసంధానంతో నిర్వహించే 'కేసముద్రం ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను ఈ సంస్థ ద్వారా రైతులు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థచైర్మన్ సొల్లేటి జైపాల్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

కవి సత్యనారాయణకు ఘన సన్మానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 8 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రిలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో జరిగిన 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో కవి, రచయిత గుర్రపు సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. పట్టణానికి చెందిన సత్యనారాయణ రాజమండ్రి ఆదికవి నన్నయ్య వేదిక తెలుగు భాష సదస్సులో తెలుగు భాష అభివృద్ధికి, మనుగడకు, వికాసానికి ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలకు పదహారు ప్రతిపాదనలతో పత్ర సమర్పన చేశారు. అందుకు గాను సత్యనారాయణను ప్రముఖ గీతాల రచయితలు భాస్కరభట్ల, వడ్డెపల్లి కృష్ణ, సిరాశ్రీ సినీ దర్శకులు ఉమా మహేశ్వరరావు సత్కరించారు.

ఆదివాసీ యువత రాజకీయాల్లోకి రావాలి

కొత్తగూడ, జనవరి 8 : ఆదివాసీ యువత ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని తుడుందెబ్బ రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి ఆగబోయిన రవి పిలుపునిచ్చారు. కొత్తగూడలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఆదివాసీ యువత రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యక్ష రాజకీయాల్లో పోటీ చేయాలన్నారు. ఆదివాసీలకు రాజ్యాంగంలో కల్పించిన చట్టాలు, హక్కుల అమలు కోసం ఆదివాసీ యువత ప్రజాప్రతినిధులుగా ఉద్యమాలు చేయాలన్నారు. వివిధ రాజకీయ పార్టీల్లో ఉండటం వల్లనే ఆదివాసీల సమస్యలు పరిష్కారానికి నోచుకోవటం లేదన్నారు. ఆదివాసీలు అణచివేతకు గురవుతున్నారన్నారు. ఆదివాసీ లు 'మా ఊర్లో-మా రాజ్యం' నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

మార్కెట్ ఉద్యోగులకు జీతాల్లేవ్

అప్పుల కోసం నానా అగచాట్లు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 8 : జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ ఉద్యోగులకు గత రెండు, మూడు నెలల నుంచి వేతనాలు సక్రమంగా రాక నానా అగచాట్లు పడుతున్నారు. రాబోయే సంక్రాంతి పండుగను కుటుంబసభ్యులతో సంతోషంగా జరుపుకుందామనుకుంటే చేతిలో డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారు. అలాగే తమ పిల్లల చదువుల కోసం నెల నెల స్కూల్ ఫీజు కట్టలేని దైన్యస్థితి ఉందని వారు వాపోతున్నారు. వేతనాలు సక్రమంగా రాక అప్పు పుట్టడం లేదన్నారు. జిల్లాలోని మహబూబాబాద్, తొర్రూరు వ్యవసాయ మార్కెట్ల పరిధిలో ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు, మూడు నెలల నుంచి వేతనాలు లేవు. ముఖ్యంగా పెన్షనర్ల పరిస్థితి కడుదయనీయంగా మారింది. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో మూడు నెలలుగా ఉద్యోగులకు, పెన్షనర్లకు, 18 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులకు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి సుమారు ఒక నెలకు రూ.6.50 లక్షలు వేతనాల రూపంలో రావాల్సి ఉంది. తొర్రూరు వ్యవసాయ మార్కెట్ పరిధిలో గత రెండు నెలలుగా వేతనాలు అందడం లేదు. ఈ వ్యవసాయ మార్కెట్ పరిధిలో ముగ్గురు ఉద్యోగులు, ఇద్దరు పెన్షనర్లు ఉన్నారు. వారికి నెలకు రూ.3.70 లక్షలు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం స్పందించి వేతనాలు విడుదలయ్యేలా చూడాలని వారు కోరుతున్నారు.

ఆరు గ్యారెంటీలు అమలవుతాయి..

బయ్యారం, జనవరి 8 : ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను 100 రోజుల్లో తప్పక అమలు చేసి తీరుతుందని మాజీ ఎంపీపీ గుగులోత్ కిషన్ నాయక్ అన్నారు. బయ్యారంలో సోమవారం ఆయన మాట్లాడుతూ అధికారం చేపట్టిన రెండు రోజుల్లోనే రెండు గ్యారెంటీలను అమలు చేసినట్లు గుర్తు చేశారు. బీఆర్ఎస్ నేతలు నెల రోజుల కాంగ్రెస్ ప్రభుత్వంపై అప్పుడే బురద చల్లే ప్రయత్నాలు చేయడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కంబాల ముసయ్య, పట్టణ అధ్యక్షుడు నాయిని శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఎంపీటీసీ సభ్యులు తమ్మిశెట్టి కుమారి, లక్ష్మి, సర్పంచులు రమేష్, కోటమ్మ, వెంకటేశ్వర్లు, స్వరూప, బాస్కర్, సుభద్ర పాల్గొన్నారు.

అప్రెంటిస్‌షిప్‌కు 25 మంది అభ్యర్థుల ఎంపిక

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 8: మహబూబాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సోమవారం నిర్వహించిన అప్రెంటిస్‌షిప్ మేళాలో 25 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వి.రాధాకృష్ణ తెలిపారు. స్థానిక కళాశాలలో నిర్వహించిన మేళాకు 40 మంది అభ్యర్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్, మరిపెడ విద్యహార్ప్ కంపెనీ, ఖమ్మంకు చెందిన విజయ ఇంజనీరింగ్ వర్క్స్, లక్ష్మీనరసింహ ఇంజనీరింగ్ వర్క్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అప్రెంటిస్‌షిప్ మేళాకు హాజరైన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించి వారిలో 25 మందిని ఎంపిక చేశారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రవేశ పత్రాలు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాజేశ్వర్, రమణ, ఉప్పలయ్య, శ్రీనివాస్, మురళీధర్, రాధాకృష్ణ, శ్రీవేణి పాల్గొన్నారు.

ఎండోమెంట్ రాష్ట్ర కన్వీనర్‌గా సూర్యప్రకాష్

నర్సింహులపేట, జనవరి 8 : భారతీయ జనతా పార్టీ ఎండోమెంట్ రాష్ట్ర కన్వీనర్‌గా నర్సింహులపేట మండల కేంద్రానికి చెందిన అన్నవర్జుల సూర్యప్రకాష్ శర్మను నియమిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి సోమవారం హైదరాబాద్ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. హిదూధర్మ పరిరక్షణ కోసం అన్నవర్జుల చేస్తున్న కృషి గుర్తించి ఎండోమెంట్ రాష్ట్ర బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అన్నవర్జుల సూర్యప్రకాష్ శర్మ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎండోమెంట్ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కె లక్ష్మణ్, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, ఎమ్మెల్సీ వివిఎస్ ప్రభాకర్‌తో పాటు రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



డైరీని ఆవిష్కరిస్తున్న జిల్లా ట్రెజరరీ అధికారి నాగన్నదొర

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 8: విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా ట్రెజరరీ అధికారి నాగన్నదొర అన్నారు. మహబూబాబాద్‌లోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో సోమవారం 2024-నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ట్రెజరరీ అధికారి మాట్లాడుతూ.. పెన్షన్ దారులకు ఆదాయపన్ను స్లిప్పులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వచ్చే సంవత్సరం ఆదా యపన్ను పెన్షన్లలో మినహాయించకుండా ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు షైస నాగయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు వలబోజు సోమయ్య, పి.మంగపతిరావు, జి.నారాయణ, మోహన్‌రావు, ఐవీ.రమణయ్య, రఘుపతి, నర్సయ్య, వెంకట్‌రెడ్డి, రాములు, యాకూబ్, ప్రసాదరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బడిబయటి విద్యార్థిని బడిలో చేర్పించిన సీఆర్పీ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 8 : మహబూబాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం బడిబయటి విద్యార్థి పెసరి ఉదయ్‌సాయిని గుర్తించి ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల సీఆర్పీ అరుణ బడిలో చేర్పించారు. జిల్లా కేంద్రం గుమ్ముడూరుకు చెందిన బడిబయట పిల్లలను గుర్తించే సర్వేలో భాగంగా సోమవారం బడిమానేసిన విద్యార్థి ఉదయ్‌సాయిని గుర్తించి వెంటనే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతిలో చేర్పించారు. ఈ సందర్భంగా సీఆర్పీ అరుణ మాట్లాడుతూ... 11, డిసెంబరు 2023 నుంచి బడిబయట పిల్లలను గుర్తించేందుకు విద్యాశాఖ ఆదేశాల మేరకు క్లస్టర్ పరిధిలోని ప్రతి ఇంటిని సర్వే చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం సిరినాయక్, ఉపాధ్యాయుడు వాసుదేవ్ పాల్గొన్నారు.

చిగురించిన ఆశలు

(5వ పేజీ తరువాయి)

ఆదేశాలతో బిల్ట్ ఆస్తులపై హక్కులు పొందిన ఫిన్‌క్వెస్ట్ ఫైనాన్స్ సొల్యూషన్ మేనేజింగ్ డైరెక్టర్ హార్థిక్ పటేల్, ఐటీసీ పేపర్ బోర్డులు, స్పెషాలిటీ పేపర్స్ విభాగం సీఈవో వాదిరాజ్ కులకర్ణితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణపై చర్చించారు. కర్మాగారాన్ని తెరిపించేందుకు ప్రభుత్వం ద్వారా పూర్తి సహకారం అందిస్తామని హామీనిచ్చారు. దీనిపై ఐటీసీ, ఫిన్‌క్వెస్ట్ ఫైనాన్స్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. దీంతో కార్మికుల్లో అడుగంటిన ఆశలు మళ్లీ చిగురిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బిల్ట్ కర్మాగారానికి మంచిరోజులు రావాలని సర్వత్రా కోరుకుంటున్నారు.

2014లో మూతపడిన ఫ్యాక్టరీ

కమలాపురంలో 1975 మార్చి 18న బిల్ట్ కర్మాగారానికి (కలప గుజ్జు తయారీ యూనిట్)కు పునాదిరాయి పడింది. పారిశ్రామికవేత్త ఎల్.ఎం.థాపర్ ఏపీ రేయాన్స్ పేరిట కంపెనీని స్థాపించగా 1981లో ఉత్పత్తి ప్రారంభమైంది. 2014 వరకు విజయవంతంగా నడిచిన ఫ్యాక్టరీలో ఉత్పత్తయ్యే కలప గుజ్జుకు బహిరంగ మార్కెట్‌లో విలువ పడిపోయింది. దీంతో ఆ ఏడాది ఏప్రిల్ 4న ఉత్పత్తిని నిలిపివేస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. అంతకు మూడురోజుల ముందు రెండు వేల మంది పీఎఫ్ కార్మికులను విధుల నుంచి తొలగించింది.

ప్రోత్సాహకాలను ప్రకటించిన బీఆర్ఎస్ సర్కార్

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత మూతపడ్డ తొలి మధ్యతరహా పరిశ్రమగా బిల్ట్ చర్చనీయాంశమైంది. ఫ్యాక్టరీని తిరిగి తెరిపించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకొచ్చింది. 2015లో జీవో 19 ద్వారా కొంతమేరకు రాయితీలు ప్రకటించింది. అయితే అవి సరిపోవంటూ యాజమాన్యం తెగేసి చెప్పింది. ఈ నేపథ్యంలో మళ్లీ 2018లో రూ.350 కోట్ల ప్యాకేజీని ప్రకటిస్తూ అప్పటి ప్రభుత్వం జీవో 48ను విడుదల చేసింది. కలపకు ఏటా రూ.21కోట్ల సబ్సిడీని ప్రకటించింది. ఏడేళ్ల పాటు మొత్తం రూ.147 కోట్లు మంజూరు చేసేందుకు అంగీకరించింది. అలాగే విద్యుత్‌కు ఏటా రూ.9 కోట్ల చొప్పున ఏడేళ్ల పాట్లు మొత్తం రూ.63కోట్లు, ఏటా 1.50లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గును ఏడేళ్ల పాటు సరఫరా చేసేందుకు రూ.వెయ్యి చొప్పున మొత్తంగా రూ.105 కోట్లను చెల్లించేందుకు ఒప్పుకుంది. కమర్షియల్ ట్యాక్స్, టీఎస్-ఎన్‌పీడీసీఎల్‌కు బకాయిపడ్డ సొమ్మును వాయిదాల పద్ధతిలో చెల్లించేందుకు ఒప్పందం చేసుకుంది. అయితే.. మొదట్లో ఫ్యాక్టరీని తెరిచేందుకు అంగీకరించిన మేనేజ్‌మెంట్ కొద్దిరోజులకు మాట మార్చింది. ఈ కర్మాగారం పేరున పెద్ద ఎత్తున రుణాలు తీసుకోగా రుణదాత సంస్థల ప్రతినిధులు, కార్మికులు నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్ఏటీ)ని ఆశ్రయించారు. యాజమాన్య నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కార్మికులు 777 రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేశారు. మొదటి దఫా 363 రోజులుగా, రెండో దఫా 414 రోజులు దీక్ష కొనసాగించారు.

వేతన బకాయిలు ఇప్పిస్తారా...!?

ఫ్యాక్టరీలో ఉత్పత్తి నిలిచిపోవడానికి ముందు 600 మంది కాంట్రాక్టు కార్మికులు, 317 మంది పీఎఫ్ కార్మికులను యాజమాన్యం విధుల నుంచి తొలగించింది. ప్రస్తుతం 600 మంది పర్మనెంట్ కార్మికులు మిగలగా వారికి ఎలాంటి జీతాలు లేవు. ఈమొత్తం బకాయి ఇప్పటి వరకు రూ.50 కోట్లపైనే ఉంటుందని అంచనా. గడిచిన తొమ్మిదేళ్లలో చాలా మంది ఉద్యోగ విరమణ పొందగా వారికి ఎలాంటి ప్రయోజనాలు అందలేదు. ఒకవేళ ఫ్యాక్టరీని తెరిపిస్తే పెండింగ్ వేతనాల మాటేమిటి..? అనే ప్రశ్న తలెత్తుతోంది. ఉపాధి లేక పొట్టచేత పట్టుకొని వలస పోయిన వారిని ఆదుకోవాలని సర్వత్రా కోరుతున్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి



నివాళులు అర్పిస్తున్న కుసుమాంజలి

కొత్తగూడ, జనవరి 8: మండలంలోని వేలుబెల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మోకాళ్ల నాగమల్లయ్య(50) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. నాగమల్లయ్య మృతికి పలు ఉపాధ్యాయ సంఘాలు సంతాపం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క కోడలు కుసుమాంజలి వేలుబెల్లిలో నాగమల్లయ్య భౌతికకాయం వద్ద నివాళులు అర్పించారు. కుసుమాంజలి వెంట ఎంపీపీ బానోత్ విజయ రూప్‌సింగ్, సర్పంచ్ వజ్జ వెంకటలక్ష్మి సురేందర్, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉల్లెంగుల రమేష్, ఉప సర్పంచ్ ఉల్లెంగుల సురేష్ ఉన్నారు. టీపీటీఎఫ్ నాయకులు నాగమల్లయ్య భౌతికకాయంపై టీపీటీఎఫ్ జెండా కప్పి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం, ఉపాధ్యక్షులు రమేష్, కార్యదర్శులు విష్ణువర్ధన్, సాంబయ్య గూడూరు, గంగారం మండల బాధ్యులు యాదగిరి, రేణేశ్వర్, వీరాస్వామి, శ్రీను, ఆదినారాయణ పాల్గొన్నారు.